# మనస్సులో కొరివి దెయ్యాలు

కథానిక

లైటు ఆర్పేసి అప్పుడే మేను వాల్చాడు శివరామయ్య. దుప్పటి పైకి లాక్కొంటూ కన్ను అట్లా మూశాడో లేదో, ఇంతలో బయట ఏదో కాస్త చప్పుడైనట్టుతోచి వెంటనే దుప్పటి ముసుగు తొలగించాడు. అసలే అనుమానపు మనిషి. బయట వరండాలోకి వచ్చాడు, అడుగులో అడుగు వేసుకుంటూ. నక్షత్రాల కాంతికి అస్పష్టంగా అగుపించే ప్రకృతి తప్ప ఏం కనిపించలేదు. కాని వరండాపైకి బలంగా అల్లుకున్న మల్లెచెట్టుదగ్గర తన కొడుకు భావనారాయణ ఉన్నాడనేది ఆయనకు వెంటనే తెలిసింది.

"వీడు ఈ సమయంలో ఇక్కడ ఎందుకున్నాడు? ఎందుకుండవలసి వచ్చింది?" అనుకున్నాడు శివరామయ్య.

భార్యతో పోట్లాడి అలిగి ఆక్కడ పచార్లు చేస్తున్నాడా? లేకపోతే... శివరామయ్య ఏదో ఒక నిశ్చితాభిప్రాయానికివచ్చి తృప్తిపడకముందే భావనారాయణ అక్కణ్ణుంచి కదలి వీధివైపుకు వెళ్ళాడు.

శివరామయ్య మెదడులో వివిధ రకాలైన ఆలోచనలు కదులాడినై. ఏమిటి వీడు ఎక్కడికు పోతున్నట్టు? గబగబా కోడలు గదిలోకి వెళ్ళి చూశాడు. ఆమె నిశ్చింతంగా ఏ చింతాలేనట్టు నిద్రపోతోంది. శివరామయ్య మదిలో మెదిలిన దురభిప్రాయాలకు, అనుమానాలకు చాలా బలం చేకూరింది.

"భార్యను అట్లా నిద్రపుచ్చి, పదకొండు గంటల వేళప్పుడు వీడికి బజారు వెళ్ళాల్సిన అగత్యం ఏం కలిగింది? వీడికి ఊళ్ళో ప్రియురాళ్ళు ఎవరైనా ఉన్నారా!...కాకపోతే వీడికీ అర్థరాత్రి ప్రయాణం ఎక్కడకి? ఎన్నాళ్ళనుంచి సాగిస్తున్నాడు—ఈనాటకం? ఎంత అగౌరవం ఎంత అప్రతిష్ఠ! ఉద్యోగం వెలిగిస్తోన్న జ్ఞానం కూడా లేదే!...వీడి కోతిచేష్టలు నేను బ్రతికి ఉండగానేనా...చూస్తాను. కనుక్కొంటాను వీడి రహస్యం. వేస్తాను మొఖంవాచేట్లు చీవాట్లు. సరైనదారికి రాక ఏమౌతాడు?" అనుకున్నాడు శివరామయ్య.

త్వరగా భావనారాయణను వెంబడించాడు. భావనారాయణ ఎలెక్ట్రిక్ లైట్ల క్రిందుగా త్వర త్వరగా నడుస్తున్నాడు. శివరామయ్య కొడుక్కి కనపడకుండా వాడు వెనుదిరిగి చూసినప్పుడల్లా పక్కకు చీకట్లోకి ముఖం తప్పిస్తూ నడుస్తున్నాడు.

తన కెందుకు ఇంత అనుమానం. వాడెట్లా పోతే తనకేం. జ్ఞానం తెలీని మూఢుడా! రెండు వందల రూపాయల ఉద్యోగం చేస్తున్నాడే, వాడికి పరువు మర్యాదలు తెలియవా? అసలు వాడి స్వభావం తనకు తెలీకండా ఉందా! ఆ బుద్ధి ఎప్పుడైనా ఉందా! ఛీ. తను ఒట్టి అనుమానపు మనిషి. ఇన్నిసంవత్సరాలు పెంచినా కొడుకుమీద నమ్మకం ఉంచుకోలేక పోయాడు. వాడు అటువంటి నీతిమాలిన పోకిరీ వెధవకాడు. తనిట్లా వాడిని వెంబడిస్తోన్నట్టు ఎవరన్నా చూస్తే తన పరువూ చివరకు వాడి పరువూ ఏమౌతుంది?

కాదు! కాదు...ఎట్లా చెపుతాం. ఏ క్షణాన బుద్ధి ఎట్లా వక్రిస్తుందో! నవయవ్వనం. మోహపు కోర్కెలముందు నీతీ, పరువూ, తండ్రి భయమూ అక్కరకురావు. తండ్రిగా బాధ్యత నెరవేర్చుకోవాల్సిన అవసరం తనపై ఉంది. సక్రమమార్గంలో పెట్టటం తనవంతు. మనస్సును కట్టుదిట్టం చేసుకొని శివరామయ్య కొడుకును వెంబడిస్తోనే ఉన్నాడు. జనసంచారం చాల స్వల్పం. రిక్షా బళ్ళవాళ్ళు, గుర్రపు బళ్ళవాళ్ళ మోత తప్ప వేరే శబ్దం లేదు.

భావనారాయణ పోయిపోయి ఒక సినిమా హాలుదగ్గర ఆగేవరకు నిజంగా శివరామయ్య

మనస్సు అదో ఘర్షణతో ఉన్నదని చెప్పవచ్చు. సినిమా హాలుదగ్గర కొడుకు ఆగటంతో శివరామయ్య మనస్సు చివుక్కుమంది. తను అనవసరంగా పెద్ద అనుమానంతో అవస్థపడ్డాడు. వాడు సినిమాకు వచ్చినట్టు ఉన్నాడు.

"సినిమాకైతే ఇప్పుడు రావటమేమిటి? కాదు. ఇందులో యేదో కిటుకు ఉంది" శివరామయ్య కూడా టిక్కెట్టు కొనుక్కొని హాలులోకెళ్ళి చీకట్లో ఒకమూల కూర్చున్నాడు భావనారాయణకు కనపడకుండా.

సినిమా జరుగుతోంది కాని శివరామయ్యకు భావనారాయణను గురించిన ఆలోచనలే విపరీతంగా రావటంచేత సినిమా విషయాలు బోధపడటంలేదు. వీడి ప్రియురాలు సినిమాకు వచ్చిందేమో! ఒకవేళ తను వెంటబడ్డాడని తెలిసి ఇట్లా సినిమాహాల్లో జొరబడ్డాడేమో!

ఇంటర్ వెల్ లో లైట్లు వేశారు. ఎంత కనబడకుండా ఉందామనుకున్నా పాపం శివరామయ్య అలా భావనారాయణ అప్రయత్నంగా తల వెనక్కు తిప్పేసరికి తప్పనిసరిగా కనుపించాడు. అరె! ఇదేమిటి తండ్రి సినిమాకు రావటమేమిటి? ఎన్నడూ సినిమాలుచూడడే, అందులో రెండో ఆటకు రావటమా? అదీకాక తనువచ్చేటప్పుడు ముసుగు కప్పుకొని గదిలో పండుకొని ఉన్నాడే...

మళ్ళీ లైట్లు ఆర్పివేశారు.

"ఛీ. ఒట్టి అనుమానపు మనిషి" అనుకున్నాడు భావనారాయణ.

* * *

భావనారాయణ పదకొండు గంటలకు ఆఫీసుకు వెళ్ళాడు మామూలుగా. ఆఫీసుకు రావటంతోటే ముందుగా క్లర్కులందరిదగ్గరకు వెళ్ళి వాళ్లు చేసేపనిని తిలకించే అలవాటుప్రకారం అందరి దగ్గరకూ వెళ్ళివస్తూ రామచంద్రయ్య దగ్గరకుకూడా వెళ్ళాడు.

రామచంద్రయ్యదగ్గర ఇద్దరు మనుష్యులెవ్వరో కూర్చొని ఉన్నారు. వాళ్ళతో రామచంద్రయ్య మాట్లాడుతూ, భావనారాయణను అంతదూరంలోనేచూసి కిసుక్కున సంభాషణ ఆపివేయడంతో ఎందువలనో భావనారాయణకు చప్పున అనుమానం కలిగింది.

"వీళ్ళెవ్వరు? ఎందుకు ఇక్కడ ఉన్నట్టు? ఏదన్నా పని ఉంటే తన పర్మిషన్ తో జరిపించుకోవాలి కాని ఇలా చాటుసంభాషణలు ఏమిటి? అసలు కొంపతీసి, రామచంద్రయ్య లంచాలు గాని యేమన్నా పుచ్చుకొంటున్నాడా యేమిటి? ఏమో, ఎవరు కనిపెడుతున్నారు" అనుకున్నాడు భావనారాయణ. కాని అరగంట ఉన్నా వాళ్లు అక్కడనుంచి వెళ్ళకపోయేటప్పటికి భావనారాయణకు అనుమానం బలిసి-ఏం జరుగుతోందోనని రామచంద్రయ్య గదిదగ్గరకు వెళ్ళి కొంచెంసేపు పొంచి విన్నాడు కాని వాళ్ళు మరి ఏ కారణంచేతనో ఆ కొద్ది నిముషాలసేపు ఏమీ మాట్లాడుకోలేదు. రామచంద్రయ్య లెక్కలు చూసుకుంటున్నాడు, భావనారాయణ తన గదిలోకి వొచ్చి కూర్చున్నాడు.

"ఏమిటి? వెధవది తనకెందుకింత అనుమానం. పదిపన్నెండేళ్ళనుంచి పనిచేస్తున్న రామచంద్రయ్య స్వభావాన్నిగురించి తనకెందుకు అనుమానం. ఎన్నడైనా రామచంద్రయ్య లంచంతీసుకున్నటు ఉందా, ఇన్నేళ్ళనుంచి. తను ఒట్టి అనుమానపు మనిషి."అనుకున్నాడు కుర్చీలోకూర్చొని.

కాని ఆ అభిప్రాయంమీద నిలువలేకపోయాడు,భావనారాయణ. మధ్యాహ్నం రెండు గంటలకు వాళ్ళతోపాటు రామచంద్రయ్య తన దగ్గరకు వచ్చి—

"కాఫీకి వెళ్ళివస్తాను సార్!"అని సెలవుతీసుకొని వెళ్ళేటప్పటికి భావనారాయణకు ఒక విధమైన అనుమానం వేసింది, ఒకవేళ హోటల్లో లంచం తీసుకుంటాడేమో! ఏం, ఎందుకు తీసుకోకూడదు? ఈ కరువు రోజుల్లో డబ్బునుచూస్తే ఎవరికి పుటదు ఆశ! మహామహావాళ్ళే తీసుకోగా లేంది రామచంద్రయ్య లంచం తీసుకోవటంలో ఆశ్చర్యం ఏముంది? కాని-అట్లా జరగరాదు. ఒకడు అలవాటుపడితే అందరూ అదే ఒరవడిని అవినీతికి పాల్పడతారు. తన మేనేజకత్వంవల్ల ఫలితం శూన్యంకావటం, ఆఫీసంతా అలజడి కావటం నానా ఘండాలంగా అంటుంది. తను ఈ ఘండాలం అరికట్టాలి.

భావనారాయణ వాళ్ళను పోనిచ్చి వెంట తాను కూడా మర్రిచెట్టు క్రింద హోటలుకు వెళ్ళాడు. వీళ్ళకి సాధ్యమైనంతవరకు కనపడ

కుండా స్తంభం చాటున వాళ్ళకు దగ్గరగా కూర్చొని కాఫీ తాగుతున్నాడు.

"అయితే లగ్నం ఎప్పుడు పెట్టుకుందా మంటారు" అన్నాడు ఆ వ్యక్తుల్లో ఒకతను.

"వచ్చే నెలలో మంచి రోజు చూసుకొని పెట్టుకోవచ్చు" అన్నాడు ఇంకోకతను

"పెళ్ళి తక్కువ కర్చులో జరిపించాలని నా ఊహ. ఎందుకంటే ఇంకా పెళ్ళి కావలసిన వాళ్లు ఉన్నారు" అన్నాడు రామచంద్రయ్య.

"సరే—అలాగే చూద్దాం" అన్నాడు ఆ వ్యక్తుల్లో ఒకతను.

ఈ సంభాషణంతా విన్న భావనారాయణ మనస్సు చివుక్కుమన్నది తను అనుకొన్నదంతా అపోహ పెళ్ళి విషయమై ప్రొద్దుట్నుంచీ మాట్లాడుకొంటున్నట్టున్నారు

రామచంద్రయ్య బిల్లు చేతిలో పట్టుకొని లేచి రెండడుగులు వేసి- స్తంభం చాటున కాఫీ చప్పరిస్తూన్న మేనేజర్ను చూసి ఆశ్చర్య చకితుడయ్యాడు. ఈ హోటలుకు ఎన్నడూ రాడే. ఇవాళ ఎందుకొచ్చినట్టు ఎప్పుడూ ఆ శ్రీనివాస అయ్యరు హోటలుకు వెళతాడే ..


ప్రొద్దుటివాలకాన్ని బట్టి, ఇప్పటివాలకాన్ని బట్టి భావనారాయణమనస్సులోని అభిప్రాయాన్ని ఇట్టే గ్రహించాడు రామచంద్రయ్య.

"ఒట్టి అనుమానపు మనిషి" అనుకున్నాడు రామచంద్రయ్య, బిల్లుచెల్లిస్తూ

*

తొమ్మిదిగంటల బండికి ఇంటికి వచ్చాడు రామచంద్రయ్య—కొడుకు కృష్ణసాగరాన్ని కాలేజీలో చేర్పించి రెండురోజులక్రితం వెళ్ళిన రామచంద్రయ్య కొడుకుకు బస్తీలో కాలేజీకి దగ్గరగా ఉండేటు, చుట్టూ గౌరవనీయుల కుటుంబాలు నివసించే పేటలో మేడలో ఒక చిన్న రూము అద్దెకు కుదిర్చి, హోటలుకు ముప్పయిరూపాయలు చెల్లించి, పుస్తకాలవీ కొనుక్కొని, జాగ్రత్తగా చదువుకోమని చెప్పి—అవసరమైన మరికొన్ని జాగ్రత్తలు చెప్పి ఇంటికి వచ్చాడు

"అంతా ఇంతవరకు బాగానేఉంది పోగానే



భారత ప్రభుత్వం ఆర్థిక శాఖామంత్రి శ్రీ చింతామణి దేశముఖ్ యీ వారంలో మద్రాసులో ఆంధ్ర మహిళాసభ నర్సింగ్ హోమ్‌కు ప్రారంభోత్సవం చేసినప్పటి ఛాయాచిత్రం శ్రీమతి దుర్గాబాయి, శ్రీయుతులు రాజాజీ, బులుసు సాంబమూర్తి మున్నగువారు చిత్రంలో కానవగును

సీటు కూడా దొరికింది. రూము కూడా మంచి ప్రదేశంలోనే దొరికింది, అదృష్టంకొద్దీ. ఇహ వీడు చదవటంలోనే ఉంది..." అన్నాడు రామ చంద్రయ్య భార్యతో.

"మీదంతా ఇది. వాడు చదవక ఏంచేస్తా డంటారు?" అన్నది భార్య.

"సరే. చూస్తాంగా!" అన్నాడు రామ చంద్రయ్య తల సవరించుకుంటూ.

కాని పదిహేనురోజులు గడచినవో లేవో మూడుత్తరాలు వ్రాసి కృష్ణసాగరం క్షేమాలు కనుక్కున్నాడు. అయినప్పటికీ రామచంద్రయ్య మనసు కుదుట పడలేదు. ఒక శెలవ రోజున—

"వాడి దగ్గరకు వెళ్ళి వస్తాను." అన్నాడు భార్యతో.

"ఏం. అప్పుడే ఏం ముంచుకు పోయింది. వాడు వెళ్ళి పదిహేనురోజులు కూడా కాలేదే! అక్కడికీ మూడు ఉత్తరాలు వ్రాసి సమాధానం తెప్పించుకున్నారే - ఎందుకూ రానుపోను తిరుగుళ్ళకు డబ్బు దండుగ. ఇంతలో వాడేమై పోతాడని" అన్నది భార్య భర్త అవివేకాన్ని వెల్లడిస్తూ.

"నీకు తెలీదులేవే" అని ఆ ఉదయం ఎనిమిది గంటల బండి ఎక్కాడు.

హైస్కూల్లో సత్ప్రవర్తన కలిగి ఉండి, తలి దండ్రులపట్ల వినయ విధేయతలు, భక్తి శ్రద్ధలు కలిగి ఉండికూడా కాలేజీల్లో చేరి బస్తీ జీవితానికి అలవడి పోకిరీ తిరుగుళ్లు తిరిగి చెడిపోయిన విద్యార్థుల్ని చాలమందిని చూశాడు రామ చంద్రయ్య. అట్లాచెడిన వాళ్ళలో వెంకట్రా మయ్య కొడుకే ఈమధ్య నిదర్శనం.

కృష్ణసాగరానికి తనంటే భయభక్తులున్నాయి. తన మాట జవదాటే తెలివీ, ధైర్యమూ వాడిలో లేవు. తను ప్రతి ఉత్తరంలోనూ బాగా చదువు తూండమనీ, బజారుకు అవసరమైతే తప్ప వెళ్ళ వద్దనీ, సినిమా నెలకు ఒకటి చొప్పున తెలుగు దైతేనే చూడమనీ వ్రాశాడు. అట్లా తన మాటల ప్రకారమే నడుచుకొంటూ ఉండాలి. తనకు లేనిపోని అనుమానాలు. చెడు పిల్లల స్నేహాలుచేసి చెడిపోతాడని. వాడు అసలే అమాయకుడు. చెప్పుడు మాటలు విచారణలే కుండా నమ్ముతాడు. అటువంటివాళ్ళు చెడగొట్టే వాళ్ళకు తేలిక. తను వెళ్ళి ఇంకా నీతి బోధనలు చేయాలి.

రైలుదిగి సరాసరి నేరుగా సైకిలు రిక్షాలో కృష్ణసాగరం రూముదగ్గరకు వెళ్ళాడు. రూముకు తాళంవేసి ఉంది.

"ఎక్కడికెళ్ళాడు వీడు. అందులో ఇవాళ శెలవుగదా! చక్కగా రూములోకూర్చొని చదువుకోనక్కర్లే? తను ఊహించినట్లు అప్పుడే వీడికి చెడు సహవాసాలు అలవడినట్లున్నాయి. కాకపోతే ఈ వేళప్పుడు రూముదగ్గర ఉండక పోవటం చదువుకొనే విద్యార్థి లక్షణమేనా! రానియ్యి. వెధవను...అనుకొంటూ అరుగుమీద కూర్చున్నాడు రామచంద్రయ్య.

పావుగంట గడిచింది. అరగంట గడిచింది. కృష్ణసాగరం రాలేదు. రామచంద్రయ్యకు ఏమీ అర్థం కావటంలేదు.

"వీడు ఎక్కడకు పోయినట్లు? వీడికి తను చెప్పిన మాటలు ఏమైనా చెవి కెక్కినాయా!"

రామచంద్రయ్య ఉండబట్టలేక ఆ ఇంటి యజమానిని అడిగాడు.

"మావాడు ఎక్కడి కెళ్ళాడండీ?" అని.

"ఏమోనండి. మాకు తెలీదు. భోజనాని కెళ్ళాడేమో!" అన్నాడాయన.

భోజనానికెళ్ళినా ఈ పాటికి రావలసిందే.

"ఇదిగో మిమ్మల్ని ఒకమాట అడుగుదాను. విసిగించుకోకండి. చెప్పండి" అన్నాడు రామ చంద్రయ్య ఆయనని.

"అడగండి. విసుగెందుకు." అన్నాడాయన.

"మావాడు రోజూ సక్రమంగా కాలేజీకి వెళుతున్నాడా? అంటే రాత్రుళ్ళు వీధులవెంట పచార్లు చేయకుండా ఏడు గంటలకే భోంచేసి వచ్చి చదువుకుంటున్నాడా! సినిమాలకి వెళ్ళడం లేదుగదా! స్నేహితుల్ని రూముకు రప్పించి గోల చేయించటం లేదుగదా! సిగరెట్లు బీడీలు కాల్చ టము లేదుగదా!-ఇవన్నీ ఎందుకు అడుగుతున్నా నంటే..."

అప్పుడే భోంచేసి రూముకు వచ్చిన కృష్ణ సాగరం తండ్రి మాటల నన్నింటినీ సాకల్యంగా విన్నాడు.

"ఛీ. నాన్న ఒట్టి అనుమానపు మనిషి" అను కున్నాడు కృష్ణసాగరం.

**Edited, Printed and Published by KHASA SUBBA RAU, at *Swatantra Printers*, 2, Brodies Road, Mylapore, Madras-4.**